నమస్తే తెలంగాణ
# ఉప్పల్ | మల్కాజిగిరి | మేడ్చల్
శుక్రవారం 13 సెప్టెంబర్ 2024
FRIDAY, SEPTEMBER 13, 2024


## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**కీసర, సెప్టెంబర్ 12:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కీసరకు సమీపంలోని వర్ధన స్కూల్ వద్ద ఆగి ఉన్న లారీని కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని రాంపల్లిదాయరకు చెందిన దూసరి సాకేత్,ఇంద్రాసేనారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం ఈసీఐఎల్ లోని ఓ ప్రైవేటు దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 18 నుంచి డీఈఐఈడీ పరీక్షలు

**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్12:** ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ) ద్వితీయ సంవత్సరం థియరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు డీఈఓ విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని, ఘట్‌కేసర్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత(బాలికల) పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వివరాలకు పరీక్ష సహాయాధికారి పాపిరెడ్డిని సంప్రదించాలన్నారు.

## 19న సీజ్ చేసిన రేషన్ బియ్యం వేలం

**మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 12:** సీజ్‌చేసిన రేషన్ బియ్యాన్ని ఈనెల 19న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సీజ్ చేసిన 4998.99 క్వింటాళ్ల బియ్యం, 329.45 క్వింటాళ్ల గోధుమలు గోదాముల్లో ఉన్నాయని, ఆసక్తి కలిగిన బేవరేజస్, డిస్టిలరీ సంస్థల ప్రతినిధులు వేలంలో పాల్గొని బియ్యం, గోధుమలు పొందాలని సూచించారు.వేలంలో పాల్గొనే వారు రూ. 50 వేల డీడీ కట్టి వేలంలో పాల్గొనాలని, వేలం పాటలో నెగ్గిన వారు మొత్తం పైకం వెంటనే చెల్లించి సరుకును 48 గంటల్లో స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

## వ్యక్తి ఆత్మహత్య

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 12:** ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి బాలాజీ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం... సాయి బాబా ఆలయం వ్యవస్థపకుడైన నన్నపూరి కృష్ణ కుమారుడు భానుప్రకాశ్(35) భార్య, కుమారుడితో కలిసి నివాసముంటున్నాడు. గత కొంత కాలంగా భానుప్రకాశ్ అనారోగ్యంతో బాధపడుతూ మానసిక క్షోభకు గురైయ్యాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు స్థానికంగా ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఫొటో గ్రాఫర్‌గా పని చేస్తున్న భానుప్రకాశ్ ఆత్మహత్య చేసుకోవడంతో బాలాజీనగర్‌లో విషాదఛాయలు నెలకొన్నాయి. పలువురు నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శుక్రవారం హిందూశ్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

# సందడిగా నవరాత్రులు

- చెరువుల వద్ద నిమజ్జన కోలాహలం
- మండపాల్లో పూజలు..అన్నదానాలు
- భారీగా ఉరేగింపులు
- డీజే మోతలు..యువత చిందులు

**కాప్రా/ఘట్‌కేసర్:** ఓ వైపు గణనాథులకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహిస్తున్నారు. మరోవైపు విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తుండడంతో నవరాత్రులు కోలాహలంగా జరుగుతున్నాయి. పలు చెరువుల వద్ద నిమజ్జన సందడి నెలకొన్నది. కాప్రా, ఏదులాబాద్‌తో పాటు మినీపాండ్‌ల వద్ద విగ్రహాల నిమజ్జనం కొనసాగుతున్నది.

కాప్రా చెరువు, మినీపాండ్‌లలో వినాయకుల ను నిమజ్జనం చేసేందుకు అధికారులు ఐదు క్రేన్‌లను అందుబాటులో ఉంచగా, మరోవైపు నిమజ్జన శిథిలాలను ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ సిబ్బంది వాహనాల్లో జవహర్‌నగర్‌కు తరలిస్తున్నా రు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఏదులాబాద్ చెరువు, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని మీరాలం కుంట,హనుమక్ళకుంటల్లో వినాయకులను నిమజ్జనం చేస్తున్నారు.చెరువుల వద్ద భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేశారు.


ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఏదులాబాద్ చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి వచ్చిన పిల్లలు,మహిళలు


కాప్రా చెరువులో గణపతి విగ్రహాలను క్రేన్‌తో నిమజ్జనం చేస్తున్న దృశ్యం


కాప్రా చెరువు వద్ద నిమజ్జన శిథిలాలను క్రేన్‌తో తొలగించి జీహెచ్‌ఎంసీ వాహనాల్లో తరలిస్తున్న దృశ్యం.


మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో వినాయక మండపంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ,ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్


గౌతంనగర్‌లోని వినాయకుని దర్శించుకున్న ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ సునీతారాముయాదవ్


రామంతాపూర్: హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లో వినాయకుకి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి.


శామీర్‌పేట: అలియాబాద్ గ్రామంలోని అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో దాత నీరుడి బాలేశ్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు.

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం సహయ నిధి చెక్కులను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

**శామీర్‌పేట/మేడ్చల్, సెప్టెంబరు 12 :** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇద్దరికి సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. మేడ్చల్ పట్టణానికి చెందిన విజయలక్ష్మికి రూ.39వేలు, అత్వెల్లికి చెందిన బాలమ్మకు రూ.29,500 మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను గురువారం మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి బోయినిపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేశ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు. అదేవిధంగా మూడు చింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామానికి చెందిన ఎల్ల భానుకు రూ.60 వేలు, ర్యాకల సురేశ్ రూ. 46 వేలు, బుద్ది ప్రవీణ్ రూ.11 వేలు, ఉద్దెమర్రికి చెందిన నాగేశ్‌కు రూ.48 వేలు, బాలేశ్‌కు రూ.33 వేల సీఎం సహాయ నిధిచెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, హరిమోహన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు సంజీవ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**మేడ్చల్ రూరల్ :** సీఎం సహాయనిధి నుంచి 19 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 6,81,000ల నిధుల చెక్కులను గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలోని డీ. భానుచందర్, బేరి లలిత, ఎన్. నరహరి, వినయ్‌రెడ్డి, దండు భానుచందర్‌కు ఒక్కొక్కరికి రూ 60 వేలు, రామకృష్ణంరాజుకు రూ. 57,500లు, కృష్ణకు రూ. 54 వేలు, చిన్నారెడ్డికి రూ.47,500లు, సోచమ్మకు రూ. 33 వేలు, యాదమ్మ, రామకృష్ణలకు చెరో రూ 19,500లు, లక్ష్మీకి కూ. 25,500లు, శ్రీశైలంకు రూ.22,500లు, సాయిరెడ్డికి రూ. 30 వేలు, రాజిరెడ్డికి రూ. 19,500లు, కుండ భానుచందర్‌కు రూ.18 వేలు, వెంకటేశ్వర్‌రావుకు రూ. 12,500లు, మల్లమ్మకు రూ. 13 వేలు, శివకుమార్‌కు రూ. 9 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ చెక్కులను చైర్ పర్సన్‌ను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజ్, హేమంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


శామీర్‌పేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


చెంగిచర్లలో పీహెచ్‌సీని ప్రారంభించిన మేయర్ అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ స్రవంతి కిశోర్

**బోడుప్పల్, సెప్టంబర్ 12:** పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. గురువారం చెంగిచర్లలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్ గౌడ్, కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, పద్మారెడ్డి, జంగయ్య యాదవ్, సుమన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ దేవేందర్ నగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు అరుణ్‌కుమార్‌కు వీల్‌చైర్ అందజేశారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తూంకుంట విద్యార్థులు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న పీడీ సత్తిరెడ్డి.

**శామీర్‌పేట, సెప్టెంబర్ 12:** 34వ రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు, ఎంఈవో వసంతకుమారి, పీడీ గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను గురువారం వారు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న మౌలాలి హౌసింగ్ బోర్డ్ కాలనీ గ్రౌండ్‌లో తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 34వ రాష్ట్ర స్థాయి పోటీలకు రంగారెడ్డి జిల్లా జట్టు తరపున తూంకుంట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులైన జి.సాయి, ఉదయ్‌కిరణ్, అనిల్, హేమంతరావు బాలుర విభాగంలో, అలేఖ్య, మౌనిక బాలికల విభాగంలో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

## రేపు డ్రాయింగ్ పోటీలు

**దుండిగల్:** బండారి లేఔట్ సంక్షేమ సంఘం, మధుపెయింట్‌ఇనిస్టిట్యూట్, స్టోరీ లైన్ టాయ్స్ అండ్ గిఫ్ట్‌షాప్ ఆధ్వర్యంలో ఈనెల 14న బండారి లేఔట్‌లోని రోడ్ నంబర్-3 బీలోని కమ్యూనిటీ హాల్‌టలో చిన్నారులకు గణనాథుడిపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు సెల్:9550887192, 89853 62248 సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు.




# జవహర్‌నగర్ అభివృద్ధే లక్ష్యం


భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మేయర్ శాంతి, కార్పొరేటర్ లలితాయాదవ్

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 12:** జవహర్‌నగర్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మేయర్ శాంతి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీనగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 10లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రగతికి కట్టుబడి ఉన్నామని, ప్రతి డివిజన్‌లో భూగర్భడ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటేష్‌గౌడ్, వినోద్, రాజుగౌడ్, అరుణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మహిళల ఉపాధికి శిక్షణ ఇస్తాం..


ఎమ్మెల్యే మర్రికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 12:** డివిజన్ పరిధిలోని ఎస్పీనగర్‌లోని మహిళా భవన్‌లో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయలో మహిళలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, జనార్ధన్, ప్రేమలత, లలిత, శారద తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మేడ్చల్, సెప్టెంబరు 12:** మేడ్చల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఏడాది కోర్సులైన వెల్డర్, డీజిల్ మెకానిక్, రెండేండ్ల కోర్సులైన టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, ఎలక్ట్రానిక్స్, మోటార్ మెకానిక్ వెహికిల్‌లలో మిగిలిన సీట్లను ఈనెల 20వ తేదీన భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు పదో తరగతి పాసైన వారు iti.telangana.gov.in అనే సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ముందుగా వచ్చిన వారికి కేటాయింపు ప్రాతిపదికన సీట్లను భర్తీ చేయనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఎయిడ్స్‌నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కీసర, సెప్టెంబర్ 12:** కీసరలోని శ్రద్ధడిగ్రీ కళాశాలలో వైఆర్‌జీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. గురువారం కీసరలోని శ్రద్ధ జూనియర్, డిగ్రీ కళాశాల్లో ఇంటర్, విద్యార్థులకు ఆ సంస్థ జోనల్ సూపర్‌వైజర్ వి, రాణి ఎయిడ్స్‌పై అవగాహనను కల్పించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధార్, స్వచ్ఛంద సంస్థ జోనల్ సూపర్‌వైజర్ టి. యశోద, రాణి,పలువురు పాల్గొన్నారు.


పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్, 20వ డివిజన్‌లోని శ్రీ సాయి ఆనందమయి గేటెడ్ కమ్యూనిటీలో నెలకొల్పిన గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. ఇందులో భాగంగా గురువారం జరిగిన పూజల్లో శ్రీసాయి హరిహర ఎస్టేట్స్ ఎండీ యాదవరెడ్డి, సొసైటీ కమిటీ సభ్యులు డాక్టర్ అశోక్ కుమార్, ప్రేమ్‌కుమార్, చేతన్, ప్రవీణ్, శ్రీనివాస్, సైదులు గౌడ్, సంజీవ్, తదితరులుపాల్గొన్నారు.


ఉప్పల్ డిపో సాయి నగర్ కాలనీ లోని గోల్డెన్ బ్రదర్స్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. యువకులు ప్రతినిత్యం పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. -అబిడ్స్

# టీజీ సెట్ పరీక్షలు ముగింపు


ప్రశ్నాపత్రం కీ పాస్‌వర్డ్‌ను విడుదల చేస్తున్న ఓయూ ఇన్‌చార్జి వీసీ దానకిశోర్

**ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 12:** తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్-2024 పరీక్షలు గురువారంతో ముగిసాయి. రోజూ రెండు సెషన్లలో మూడు రోజుల పాటు ఈ పరీక్షలను నిర్వహించారు. చివరిరోజు పరీక్ష ప్రశ్నాపత్రం కీ పాస్‌వర్డ్‌ను ఓయూ ఇన్‌చార్జి వీసీ దానకిశోర్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 24 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించినట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి తెలిపారు. చివరి రోజు మొదటి సెషన్‌లో 79.05 శాతం, రెండవ సెషన్‌లో 79 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి బృందాన్ని ఇన్‌చార్జి వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, ఈఎంఆర్‌సీ డైరెక్టర్ పి.రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## దూరవిద్య ఎంసీఏ పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలు

**ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 12:** ఓయూ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఎంసీఏ రీవాల్యుయేషన్ ఫలితాలను విడుద ల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీడీఈ) (సీబీసీఎస్) సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పా రు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.os mani a.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో షురూ

**కొండాపూర్, సెప్టెంబర్ 12:** చేనేత రంగం అనేది ఒక పరిశ్రమ మాత్రమే కాదని, మన దేశ విభిన్న సంప్రదాయాలకు నిదర్శనమని డొమెస్టిక్ వయోలెన్స్ కౌన్సెలర్ ప్రేరణ సింహ అన్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో సిల్క్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో-2024 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డొమెస్టిక్ వయోలెన్స్ కౌన్సెలర్ ప్రేరణ సింహ విచ్చేసి రాచకొండ కమిషనరేట్, ఉమెన్ సేఫ్టీ వింగ్(షీటీమ్స్), ఇంటర్‌నేషనల్ పొలిటికల్ సైకాలజిస్ట్, డాక్టర్ సుధాజైన్‌తోపాటు నిర్వాహకులు జితేందర్ త్యాగి, సోమనాథ్ బౌమిక్ కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.


కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డొమెస్టిక్ వయోలెన్స్ కౌన్సెలర్ ప్రేరణ సింహ

## భర్తతో గొడవ...భార్య పిల్లలు అదృశ్యం


సుభాషిని,


పునర్విక,


బాలాజీ(ఫైల్)

**జవహర్‌నగర్, సెప్టెంబర్ 12:** భర్తతో గొడవపడిన భార్య పిల్లలతో కలిసి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్ ఇందిరారాజీవ్‌నగర్‌లో సురపల్లి జనార్దన్, భార్య సుభాషిని, కూతురు పునర్విక(7), కుమారుడు బాలాజీ(12)తో కలిసి నివాసముంటున్నారు. ఈనెల 9న భార్యాభర్తలు జనార్దన్,సుభాషిని గొడవ పడ్డారు. మరుసటి రోజు మంగళవారం భర్త ఉద్యోగ నిమిత్తం వెళ్లగా... సుభాషిని(36) ఇంట్లో చెప్పకుండా పిల్లలతో కలిసి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగిరాలేదు. దీంతో సుభాషిణి ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు భర్త జనార్దన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాహుల్ గాంధీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 12:** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విదేశాల్లో భారత దేశంతో పాటు పంజాబ్ సిక్కులకు వ్యతిరేకంగా మాట్లాడడం అర్థరహితమని, వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, శ్రావణ్, శ్రీనివాస్, నాగరాజు, రాంబాబు, రామకృష్ణ, లక్ష్మణ్, వెంకటేష్, స్వర్ణలత, మంజూల పాల్గొన్నారు.